# కథ

అల్లం రాజయ్య

భోజనంచేసి తట్టుకుర్చీల కూర్చుండి సిగరెట్టు ముట్టించాడు నారాయణరావు.... బయట ఎండ మాడిపోతోంది... ఎదురుంగ ఎడ్ల కొట్టంమీద బెంగుళూరు పెంకలు మండుతున్నాయి.. ఇల్లు ఎల్లిపోయిన దాని తీర్గున్నది. కలాపి జల్లినోడులేడు. ఊడ్సె టోల్లులేరు.... సిగరెట్టు పొగలాగే మనుసులో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

"దండాలు దొరవారు" అన్నమాట వినిపించింది....ఈ మాట వినక సానొద్దులాయె-సిగరెట్టు పొగల మధ్యనుంచే కండ్లు చిన్నవిచేసి కనుబొమ్మలు ముడిచి అరుగు కిందికి చూసిండు.

ఇద్దరు మనుషులు చేతులు జోడించి నిలుచున్నారు. ఇద్దర్లో ఒకనిది అమ్మోరు మొఖం —ఎర్రగా బక్కగా ఉన్నాడు. పేడిమూతి- నెత్తికి గంపంత రుమాలు జుట్టున్నది-. జబ్బకు వీణ వేలాడుతోంది. రెండవవాడు పొట్టిగా నల్లగా కుదిమట్టంగా ఉన్నాడు. నల్లటి ముఖంమీద మీసాలున్నాయి. నడ్డిముక్క ఇద్దరికి తిరుమని గౌర నామాలున్నాయి మెడకాయకు విబూది ఏలుతోటి రాసున్నది....నల్లవాని జబ్బకు బుర్ర వేలాడుతోంది.

"బుడుగు జంగ మోల్లముండి- నా పేరు ఈరయ్య-మావోని పేరు దమ్మడు" అన్నాడు ఎర్రటి పొడుగోడు....

"ఒహో గంగని మనమలా ?" అన్నాడు గుర్తుకు తెచ్చుకుంటూ....

"ఔ దొరా!" అన్నాడు దమ్మయ్య....

"ఏం పనిమీదొచ్చినట్టు ?". నారాయణరావు అటెటో చూస్తూ-

"బుడుగు జంగపోల్లకు పనులేముంటయి-తమరి పేరుమీద కథ చెప్పుతం...." వీరయ్య.

"కథలా ! జా-నాట కొడాడాటాడంగ మద్దెలగాన్ని తేలు కుట్టినట్టు గిప్పుడు కతలేందిర్ర- నేను సెక్కర్లున్న...."

"గట్లన కుండ్లి-రెండేండ్ల కింద తమరు పెద్దొర్సాని దినాలకు లేగ నిచ్చిండ్లు.

అన్నదానం వస్త్రదానం చేసిండ్లు- మీ అసొంటోల్లుగట్లంటె మేం ఏడబోవాలె ?''

"నను విసిగించకుండ్లి కతలు గితలు జాస్తినయి" అన్నాడు.

అన్నదమ్ములిద్దరు ఒకల మొఖాలొకరు చూసుకున్నారు.

ఏదో యాదికొచ్చి ఇంట్లకు లేచిపోయాడు. లోపల పందిరి మంచంమీద చిన దొర్సాని కృష్ణవేణి బోర్లాపడుకొని ఏదో పుస్తకం చదువుతుంటోంది....

"ఇగో గపుస్తకాలు చదువొద్దనే నేను చెప్పేది....'' చిర చిర లాడాడు.

కృష్ణవేణి అయిష్టంగానే లేచి నిలుచుండి పైట సర్దుకున్నది.

కృష్ణవేణి లేచిన పందిరి మంచంలో నారాయణరావు పండుకున్నాడు.

కృష్ణవేణికి తను చదువుకున్న రోజులు గుర్తొచ్చినయ్. నారాయణరావు అన్న కొడుకుతో తన పెండ్లి-ఆ తరువాత కాంతారావు చంపబడడం-నారాయణరావు తనను తెచ్చుకోవడం-ఇక్కడ ఉంచుకున్నదన్న పేరు....నారాయణరావుకు మాత్రం రైతులు-సంఘాలు గుర్తొచ్చినయ్.

"ఎట్లుండె బతుకు?యేటా అయ్యగార్లను బిలిపిచ్చిహరికథలు చెప్పిచ్చెటోడు... సిందోల్లతోని భాగోతాలాడిచ్చెటోడు- గొల్లోల్లతోని నాటకాలేపిచ్చేటోడు-మాల్లోల్ల తోని పాండవుల కత చెప్పిచ్చెటోడు....వీర ముష్టోనితోని బమ్మం గారి చెరిత్ర చెప్పిచ్చెటోడు మూడేండ్లాయె-ఆటలేదు పాటలేదు. ఏత మొసదీసుకోనిచ్చిండ్లు-ఏమంట భూలచ్చిమికాడ వాళ్లచ్చి మీటింగు బెట్టిండ్లో - అప్పటినుంచి పాటలు ఆటలన్నీ ఆళ్లయేఅయినయ్....ఇదివరకు తను ఆడిచ్చేటోడు...." ఇట్లా సాగుతున్నాయి.

"ఈ పాడుబడ్డ ఇంట్ల నేనుండలేను...." నాలెచూపులు చూస్తూ కృష్ణవేణి చెప్పింది....

బంగుళ గట్టెయ్యి మంటవ్-నీదేంబోతంది....ఇప్పటికే ఆలం....కొడుకులు'' నారాయణరావు.

బుడుగు జంగాలిద్దరు ఇంటి ముంగట కొట్టంలకూసున్నరు........

"గోడలు గూలిపోతన్నయి. పైసలన్ని ఏంజేసిండో గోడలన్న కట్టిచ్చుకుంట లేడు-'' వీరయ్య.

349

అబ్బో వీడా! ఉసికెల పాపెరగాడు-మొన్న యాభయెకరాలు కొన్నడంట కొత్త పెల్లిల కరంటు మోటర్ల పైరవిమీన్నే ఎయిలు సంపాయించుంటడు. అడివి కట్టె సరేసరి-పంచాతుల దండుగులు బందయినయ్‌గని లావోతెనా!'' దమ్మయ్య.

"మెల్లెగ మెల్లెగరా?''

"బాగని ఈడగూడ ఆఖరెత్తు పారెటట్టులేదు.''

"ఇంతే సంగతులు-గాన దండములు-బుర్రలు బలిగేసుడే-రైతులు మన కతలినేటట్టులేదు-సంఘపోల్ల పాటలుదప్ప-మనకా ఆ పాటలు పాడరాదు-దొరలుకతలు వెప్పియ్యరు....''

"నేసంట — ఎందుకు సెప్పరాదు?....''

"ఏమంట సెప్పుతవరా? మనకేమెరికని,"

"ఏంది ఎరుకలేంది. నెల్లాల్లాయె తిరుగబట్టి-ఏప్పాళ్ల జూసిన అద్దం తీర్గ గస్పత్తనే ఉన్నది...."

"ఏందిర గస్పదేది? సాలుసాలు పోలీసోల్లచ్చి హాత్‌కడిలేసి పట్టుక పోతే దెలుత్తది....సాలుసాలు."

"పోతేబోతం-మన కతలినేటోల్లు-మనకు ఇన్నేండ్లు కూడుబెట్టి సాదుకచ్చి నోట్లో సెక్కర్లుంటె మనం....తినేది మొగనిసొమ్ము పాడేది బాలనాగమ్మ పాట-నామంచి గాదన్న-"

"నాలికెందుక పోతంది....గిన్నన్నినీల్లన్న బోసేదిక్కులేదుగదా!ఊరుకగ్గిదగ్గ.."

"ఈన్నేమొ ఊరు బహిష్కరించింది. ఈరి పనులన్నీ బందు-కాంతారావును అన్నకొడుకనే గురుత్తంలేకుంట సంపించ్చిండు గాడ్డి కొడుకు - ఆమెమ బయటకి రానియ్యడు. .... పోదాంపా...."

"ఆగురా ! మల్లత్తదేమొ ఆఖరి పారడుగుదాం."

"అడిగినా-ఇగో నేను మరింకే కత జెప్ప...."దమ్మయ్య తెగేసి చెప్పిండు....

"పోనీ నువ్వనే కథే చెప్పుదామనుకో - ఏమంట చెప్పుతవు ? ఎట్ల చెప్పుతవు? కొసేడ మొదలేడ?"

"కొసేంది మొదలేంది. ఖిలావనపత్తిల సూశ్నేదా? దేవయ్య కథే చెప్పుదాం – బలుగురు కొండయ్య – ఏడుగురు మరాఠీలది – బాలవద్దిరాజుది – పసుల బాలరాజుది. కథలుచెప్పంగ – గిది చెప్పుడు సుతారమా?"

"కతలు సెప్పిచ్చేది దొరలు – నువ్వు సెప్పేది దేవయ్య కథంటే చెప్పొడ బీకుతరు. అచ్చే పైసలట్లిడిసి పెట్టి – నీ మాటంటె జేలుకాన.తయారు"

"జనాలకు సచ్చుతె కడుపుల బెట్టుకుంటరు. మొదటి నుంచి నీ కతలిన్న దెవలు ?"

ఇంతలోకే నారాయణరావు బయటకొచ్చిండు.

"ఇంక బోలేదుర్ర ?"

"ఏడికి బోతముండ్లి ? తిరిగి తిరిగి యాష్టకొచ్చింది. మా కతలు ఇనే నాథుడే దొరుసతలేడు.... పెద్దు లోకులేమో ?...."

"సరే గాడ్ది కొడుకులకు గమండి బెరిగింది బంచత్– మీకేమేమి కతలొస్త యిరా ?"

వీరయ్య ముందుకు జరిగి – "బాలనాగమ్మ, బబ్బిలికథ, బలుగురు కొండయ్య కథ, ఏడుగురు మరాఠీల కథ, పసులబాలరాజు కథ." ఇట్లా చెప్పుకొచ్చిండు.

చిన్నోడు అందుకని "దేపయ్య కథ–" అందిచ్చాడు.

"సరేగాకథలన్నీ ఇన్న కథలే – మీవోడు చెప్పిందేదో కొత్తగున్నది....వారీ మీరెప్పుడన్న సంగపోల్ల పాటలిన్నరా ? అగో వాటికన్న ఘాటు గుండాలె ఇన్నరా?"

పెద్దోడు ఏదో చెప్పబోయిండు....చిన్నోడు అడ్డొచ్చి "తమరు వింటరుగదా ? ఇంకేడ జెప్పలే – మీతోనే మొదలు...."

"సరె సరె – నేనే పరెషాన్‌లున్న – సూసిండ్లు గద – మందనుకుంటరు దొరకేందని – నా యిల్లు – కొట్టాలు సూస్తిరి గదా ! మువ్వయి రూపాయలిస్త"

"ఇద్దరం నాత్రంత జెప్పాలెగాదుండ్లీ...."

"మీ యిష్టమురా ? అలిమా బలిమా ? చెప్పుతె మూడు పానాదులు కాడ...."

"కాసిన్ని మంచినీళ్ళు దొరా" చిన్నోడు.

"దొర్సాని నిదుర బోతంది."

అన్నదమ్ము లిద్దరు బయటకు నడిచిండ్లు.

"వారీ దమ్మ.నీకేమన్న పుర్రెల పురుగు మెసులు తందారా" వీరయ్య.

"లాపోతేంది. నెల రోజుల నుంచి తిరుగుతున్నం - ఎప్పుడన్న ఇసారం జేసినవా ? జనం మన కతలెందుకు చెప్పిత్త లేరొ ? నెల నుంచి తిరుగుతున్నవ్ ఊరూరికి - ఇగో గాలికి ఆకు నేనూగనంటె కలువది. అన్నింటితోపాటు తానూ ఊగాలె...." దమ్మయ్య....

"సావచ్చిందిరా ?" అన్నడు అన్న. అట్లా అన్నాడే కాని మనుసులో దేవయ్య కథ మెదులుతోంది.... రాగం పోటెత్తుతోంది.

ఇద్దరు బయటకు రాగానే పిల్లలు చుట్టు ముట్టారు.

దమ్మయ్య వాళ్ళతో కులాసాగా నవ్వుతున్నాడు....

అట్లా రాగ రాగనే కరంటు హెల్పర్ గుర్తుపట్టి -

"ఏమోయి బుడుగు జంగాలు జబ్బలు జారేసుకొని తిరుగుతండ్లు" అన్నాడు.

"ఏంజెయ్యమంటరు ? మమ్మల కానినోడెవడు లేడు గదా !"

"మందేమొ కేసులు గీసులని తిరుగుతుంటె మీరేమో పసుల బాలరాజు కథలు చెప్పితిరి. ఆడోల్లు మొగోల్లు దెబ్బలుదింటాంటే మాయల పక్కిరోడంటిరి ...." అన్నాడు.....

"నాలికెండుకపోతంది కాసిన్ని నీళ్ళు బొయ్యరా" పెద్దోడు.

ఇద్దరిని తనింటికి తీసుకపోయాడు. బుర్ర, వీణ ప్రక్కకు బెట్టి గోడ నీడన కూర్చున్నారు....

నీల్లు దాగిండ్లు-దమ్మయ్య కథ చెప్పుతున్నట్లు చెప్పిండు. రాజయ్య దమ్మయ్య మాటల్లో పడిపోయారు.

వీరయ్య గోడపక్క కొరిగిండు-కండ్లు మూసుకున్నాడు. వసపత్తిలో తను మాదిగి సాయిలు ఇంటికి పెండ్లి గురువుగ పోవడం-దేవయ్యను చూడడం - ఆ మాటలు,...,ఆ తరువాత సాయంత్రం పోలీసులు రావడం....కొట్టుకోల్లు మొత్తుకోల్లు

352

అమీన్ పిస్తోలు కాల్వడం – దేవయ్య నెత్తురుమడుగులో పడి పోవటం–శవాన్ని తీసుక పోవడం – మాదుగులు కంటికే ధార మింటికే ధారగా ఏడ్వడం – మరునాడు రాణాపురంలో ఇసుక జల్లుతే రాలని జనం–ఎన్నివేలో–శవాన్నెత్తుకుని ఊరేగింపు–ఊరేగింపుల అరుపులు–శవాన్ని ఆఖరిసారిగా చూడడంకోసం వచ్చిన జనం ఏడుపులు....అందులో పొట్టిగా ఉన్న పిర్రల గట్టయ్య లేచి "ఎందు కేడుత్రరా? ఇదేమన్నకొత్తా....కాదు–కాదురొరే కాదు–ముమ్మాటికికాదు....నాకెన్నేండ్లు....నాకండ్ల ముంగట సానామంది సానాతీర్ల సావంగ సూసిన–కనిగిసావు గసొంటి సావుగాదు–ఎద్దు బతుకుతది–ఈగ బతుకుతది. పిల్లల గంటది. కని పందోలె పదేండ్లు బతికేంభాగ్గెం.... నందోలె నాలిగేండ్లు బతుకు....మా అల్లుడు రాయరామడెందుకు సచ్చిండు–మాదిగో ల్లను కుప్పేసినందుకు. గిది ఇప్పటి మాటకాదు–పీరడెందుకు సచ్చిండు – భూమెట్ల గుంజు కున్నవన్నందుకు–ఎగులాసపురంల జంజెర్ల రాయమల్లడెట్ల సచ్చిండు–తను నీళ్ళుమోసి పెంచిన అడివిల మోపెడు పుల్లలేరుకున్నందుకు ? కనుక నేను బతుకతనని నిలబడితె సంపుతరు. బాంచెనంటె–ఆని సేవలు సేత్తే నిన్నేమనరు. కని అట్ల నీనెత్తురు తాగుతరు.... నీ మాంసం తింటరు. అట్లాసత్తవు....ఇంకో సంగతున్నది–ఆడెవడో అమ్మగారు మీనున్నదని సెయ్యిగురుతు బెట్టుకచ్చి ఏమన్నడు-గీ సర్కారుమీది–మీకు భూములిప్పితం జాగలిప్పిత్తం–నాలంజెపియి ఇప్పిత్తమన్నారు–పరంపోగులు దున్ను కొమ్మన్న దేవన్నను తుపాకినేసి సంపిండ్లు–దున్నెటోనికి భూమిగావాలనోన్నిన్ని సంపిండ్లు...."

"ఓ దేవన్నో–నాదేవన్న–మమ్ముల నట్టనడిమిల ఇడిసిపోతివా దేవన్న–నీకు గటుకండి పెడుత రావుదేవన్న–నాపెద్దకొడుకు వనుకున్నగాదు దేవన్న–ముదుగాటి బుక్క–నీకు కొట్టిన గాదు దేవన్న–ఓ దేవన్న" ఒక శ్రీరాగం తీసుకుంట ఏడుస్తోంది....

"సయిసె–సయిసు–ఏడుత్తె అత్తడా?ఆరుత్తే అత్తడా?" గట్టయ్య.

"నీకెరుక లేదుర గట్టు నాయినా? మన బతుకు తెల్లారి పోయిందిర గట్టునాయినా? ఆళ్ల సేతులకు జెట్టలు సరుప్పలు బుట్టగదురో దేవుడా? ఆళ్ల కాడుగాల గదురోదేవుడా! ఆని నాము నరుక గదురో దేవుడా? ఓ అయ్యలాలా నీరంత నాదేవన్నను సూసిండ్లు గదరా నాదేవుడా? ఆని తలపండు దెచ్చిత్తనుండ్లిరా అయ్యలాలా...." బొచ్చెసరుసు కుంట కనిపిచ్చిన వాళ్ళ మీదల్లా పడి ఏడుస్తోంది....

వీరయ్య ముఖం కమిలిపోయింది. గోడనీడ జారిపోయింది. చుట్టూ చూసిండు ఎవరులేరు....దమ్మయ్య, రాజయ్య కలసి ఎటో పోయారు.... మోకాళ్ల మీద తల పెట్టుకొని కూర్చున్నాడు.

"పిల్లోల్లారా! మాలసిమి పెనిమిటి సచ్చిండు-ఆగిందా?ఆగలేదు .... ఒరే-జాగ్ర్తగినుండ్లి....ఇంటికి పెద్దోడే-మన ఊళ్లల్ల పెద్దోడే కాదన-కని ఇంటి పెద్దోడు సత్తె ఎవుసాయ మాగుద్దారా? దున్నాలే దోకాలె పంట బెట్టాలే-గిదిగంతే...."

ఇంటికి పెద్ద ఒరిగి పోయెనని

ఏడిసి ఫలమేమి-

అయ్యో ఏడిసి ఫలమేమి-తందానో-తానె తందానా, వీరయ్య గొంతులో నుండి రాగం బయటకు వెళ్లింది.

పడమటిదిక్కు సూర్యుడు కుంకాడు ....పక్షులురొద చేస్తున్నాయి.

★ ★ ★

నెల సింతల మీది కచ్చింది. సాకల్ది ఊరు దిరిగి పోయింది.మూడు సానాదుల కాడ సుంకరోల్లిద్దరు తెచ్చేసిన తక్తు బల్లమీద వీరయ్య దమ్మయ్య కూచున్నారు.

దమ్మయ్య "తపతప" బుర్రగొట్టిండు. వీరయ్య వీణమీటిండు. ఎడమ చేతి పెద్దనేలు గజ్జెలూగినయ్....

ఆటలాడే పిల్లలు తొక్కిసలాడిండ్లు-వీరయ్య గొంతెత్తిండు.

"అగజానన పద్మార్కం...."రాగం తీగలాగా సాగుతోంది. ఇల్లిల్లు దిర్గింది....

జనాలు ఒక్కొక్కలే సంచి బొంతలు ఈతసాపలు బట్టుకొని మూడుసానాదుల కాడికి రాసాగిండ్లు-కాసేపటకి మూడు సానాదుల కాడ వీరయ్య, దమ్మయ్య సుట్టు జనం నిండిపోయిండ్లు....ఆఖరున సుంకరోడు కుర్చీమోసుకొచ్చిండు. నారాయణ రావొచ్చి కూర్చున్నాడు.

జనంలో గుసగుసలు....

"ఒరే అన్నా! కుంటి గులాపు-కాపులు, పెర్కలు,గొల్ల,సాకలి మంగలి సబ్బండ వర్నాలు వచ్చినట్టే-ఇగకథ మొదలు బెట్టు...." దమ్మయ్య....

"వోరే అందరచ్చిండ్లంటవు-అక్కలాలా సెల్లెండ్లాలా-తల్లులాలా తండ్రులారా! మాకు పిడికెడు బువ్వబెట్టి పాడుమన్నరు. పాడ్తన్నమ్....ఏంకథ చెప్పుమంటవ్....?"

"ఎల్లికి మల్లి బుట్టిందని మల్లికి ఎల్లిబుట్టిందని సెప్పేటిదే సెప్పరాదు...."

"వారీ! నేం జెప్పేకతలు అట్లుంటయనారా?"

"కోప్పడకు నేనంటలేను మందంటండ్లు—"

"ఊరికి దొరవారు దేవయ్యకత సెప్పుమన్నడు."

"సెప్పేదేదో నీవా సెప్పరాదు." మందిలనుంచి....

వీరయ్య గొంతు సవరించుకున్నాడు. వీణమీటిండు-గజ్జెలూపిండు....

"అరె పెద్ద పెల్లిలో ఉత్తరాదిన-

పేరెన్నిక గలపల్లె-నాయనా!"

ఇట్లా కథ మొదలయ్యింది. ఊరు ఎక్కడున్నదో-ఊరు ఎంత సుందరంగా ఉన్నదో చెప్పుకొచ్చిండు. ఊళ్లె బతికే వివిధ వృత్తులవారి గురించి చెప్పుకొచ్చిండు. అందులో రామయ్య, లక్ష్మమ్మ అనే దంపతులగురించి చెప్పుకొచ్చిండు- వారిద్దరికి పుట్టిన రెండవ కొడుకే దేవయ్య.దేవయ్య పసితనంలో ఆటలు-చెప్పుకొచ్చాడు.

కథ సాగుతోంది.మధ్యమధ్యలో దమ్మయ్య పిట్టకతలు చెప్పి జనాన్ని నవ్విస్తున్నాడు-రామయ్య రైతు-అతను భూమికోసం పడే తిప్పల్లు-దేవయ్య పెద్ద చదువుల కోసం తాలూకాకు బోవడం-అక్కడ చదువు-

ఇది ఇట్లా ఉండంగ-జంజెర్ల రాయమల్లడనే మాదిగివాని జీవితం-అతనికికొడుకు పుడుతాడు-తలసవరులేదు-దగ్గర్లో ఉన్న అడివికి పోయి కట్టెలు తెచ్చి తాలూకాలో అమ్మి నూనె తెద్దామనుకుంటాడు. అడవిలోకి చౌకి దారొస్తాడు....గూడిచ్చి పురుషాల మీద తంతాడు.

"అరె-గిలగిల తన్నుక తన్నుక

పానం ఒదిలిండా...." అంటూ అతిహృదయ విదారకంగా వర్ణించాడు.... చౌకిదారు అడివి కట్టె అమ్ముకొని జిల్లాల పెద్ద బంగుళ కట్టినట్టు చెప్పాడు....

అది తెలిసిన సదువుకునే పిల్లలు అన్యాయమన్నారు. సచ్చిన శవాన్ని పెట్టుకొని ఊరేగింపు తీశారు....అందులో దేవయ్య ఉన్నాడు....

ఆతరువాత దేవయ్య మీద కేసులు బెట్టడం-పోలీసులు కొట్టడం...దేవయ్య బేల్ (జామీను) మీద విడుదల కావడం....

"ఆపుండ్లిరా?" నారాయణరావు గర్జించాడు-దమ్మయ్య బుర్రాగింది-వీరయ్య వీణ ఆగింది. రాగ మాగింది....

"మీరు పాడేవి గిదా! నీతల్లి -పోలీసోల్ల పిలిపిచ్చి...."నారాయణరావు తిడుతున్నాడు....

నిశ్శబ్దం-నారాయణరావు చెప్పులు తొడుక్కున్నాడు....సుంకరోడు కుర్చీ మలిసిండు....ఇద్దరు సుంకరోల్లు తక్తు బల్ల ఎత్తుకున్నరు....

అంతలోనే జనంలో కలకలం...."ఈరయ్య,దమ్మయ్య ఆపకుండ్లి-చెప్పుండ్లి" అన్నారు....

ఎవరోపోయి పెద్ద బండి తెచ్చిపెట్టిండ్లు-

వీరయ్య,దమ్మయ్య బండిమీదకూర్చున్నారు. మళ్ళీ రాగం సాగింది.—

దేవయ్య సదువు విడిచిపెట్టి సంఘాలు బెట్టిండు. దేవయ్య గురించి దమ్మయ్య పిట్టకతలు చెప్పిండు....

తెల్లారే సుక్కపొడిచేదాక కథ సాగింది. జనం ఏడ్చిండ్లు నవ్విండ్లు, పండ్లు గొరికిండ్లు, పిడికిల్లు బిగించిండ్లు-

కథయి పోయింది....

కరంటు హెల్పర్ రాజయ్య వీరయ్యను కౌగలించుకున్నాడు....

అప్పటి కప్పుడు తోచినంత జమచేసిండ్లు-యాభయి రూపాయలైనాయి ....

"బిడ్డా! మంది కతసెప్పుండ్లి -మీకు బువ్వ కరువుండది-" అన్నాడో ముసలోడు....

నారాయణరావు పాడుబడిన ఇండ్లల్లో కాలుగాలినపిల్లోలె- నిప్పుతొక్కిన కోతోలె ఎగురుతూనే ఉన్నాడు....

సుంకరోల్లిద్దరు మల్లి కథకాడికచ్చిన సంగతి నారాయణరావుకు తెలియదు.

356